సాక్షి చిత్తూరు

సోమవారం, 28, జూలై, 2025



నింగికి సిద్ధంగా 'నిసార్'

తిరుపతి జిల్లాలోని షార్ కేంద్రం నుంచి ఈ నెల 30వ తేదీన జీఎస్ఎల్వీ ఎఫ్16 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. - 8లో



జీడీనెల్లూరులో టీ'డీ'పీ

గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీలో వర్గ విబేధాలు భగ్గుమన్నాయి. పరస్పర ఆరోపణలకు దిగుతున్నాయి. - 8లో



శ్రీవారి సేవలో సీఎస్

తిరుమల శ్రీవారిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదివారం సేవించుకున్నారు. అధికారులు ఏర్పాట్లు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని, గైర్హాజరయ్యే వారి పై శాఖాపరంగా చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

నేడు పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఉదయం 10.30 నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు.

ఉద్యోగులకు అండగా ఎన్‌జీఓ సంఘం



మాట్లాడుతున్న రాఘువులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వోద్యోగులకు అండగా ఎన్‌జీఓ సంఘం ఎల్లప్పుడూ ఉంటుందని సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవులు తెలిపారు. ఆదివారం ఈ మేరకు చిత్తూరులోని సంఘం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతున్నామన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం తప్పక నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం అబ్జర్వర్ వెంకటేశ్వర్లు, నెల్లూరు జిల్లా సంఘం అధ్యక్షుడు పెంచలయ్య ఆధ్వర్యంలో ఖాళీగా ఉన్న ఎన్జీఓ సంఘం జిల్లా కార్యదర్శి పదవికి రమేష్‌ను, 14 తాలూకా అధ్యక్ష, కార్యదర్శులను, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



విజేతలతో ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు అర్బన్: ద్విచక్రవాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ మణికంఠ చందోలు స్పష్టం చేశారు. ఆదివారం చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో స్లో మోటర్ సైకిల్ రైడింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ విచ్చేసి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ , ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ద్విచక్రవాహనదారులు మరింత అప్రమత్తంగా బండి నడపాలని కోరారు. కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రత సూచనలు పాటించపోవడంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు సాయినాథ్, చిన్నికృష్ణ, మహబూబ్ బాషా, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, సీఐ మహేశ్వర, నెట్టికంఠయ్య, ఆర్ఐ సుధాకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ



చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిక్కిరిసింది. వేకువజాము నుంచే మన రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు పిండి, నూనె దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు హుండీ లెక్కింపు

బోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం ఉదయం 7 గంటలకు హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు.

• కబంధహస్తాల్లో కట్టమంచి








చిత్తూరులోని కట్టమంచి చెరువు మట్టి మాఫియా కబంధ హస్తాల్లో చిక్కుకుంది. స్థానిక ప్రజాప్రతినిధి అండదండలతో రెచ్చిపోతోంది. ఇరిగేషన్ అధికారుల సహకారంతో యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తోంది. భారీ యంత్రాలను రంగంలోకి దింపి చెరువును గుంతమయంగా మార్చేస్తోంది. వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లతో గ్రావెల్‌ను తరలించేస్తోంది. రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు విక్రయిస్తూ రూ.కోట్లు పోగేసుకుంటోంది. ప్రశ్నించిన వారిపై దాడులకు సైతం తెగబడుతోంది. – సాక్షి, టాస్క్‌ఫోర్స్

దొంగాట రయ్.. రయ్



జిల్లాలో ట్రావెల్ నిర్వాహకులు యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. ఒకే నంబర్‌తో రెండు.. మూడు బస్సులను నడుపుతున్నారు. తప్పుడు పత్రాలతో ఇష్టారాజ్యంగా సర్వీసులను తిప్పుతున్నారు. నకిలీ రశీదులతో ట్యాక్స్ ఎగ్గొడుతున్నారు. ప్రయాణికులను మాత్రమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా భారీ లగేజీలను తరలించేస్తున్నారు. అలాగే వాహనాలను ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించి ఇక్కడ చెల్లించాల్సిన పన్నుకు పంగనామాలు పెట్టేస్తున్నారు. రవాణాశాఖ అధికారులను బురిడీ కొట్టించి ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. కేసులకు సైతం వెరవకుండా బరితెగించి మరీ బస్సులను నడిపేస్తున్నారు.

- ఇటీవల బెంగళూరు–తిరుపతి వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్‌ను చిత్తూరులో జిల్లా రవాణాశాఖ అధికారులు పట్టుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆన్‌లైన్ ద్వారా బస్సు వివరాలను చూస్తే పట్టుబడిన బండిని విజయవాడలో సీజ్ చేసినట్లు తేలింది. దీంతో రవాణాశాఖ అధికారులు లోతుగా విచారించారు. విజయవాడలోని అధికారికి ఈవిషయంపై సమాచారం అందించారు. కేసు నమోదు చేయించారు. చిత్తూరు నగరంలో సీజ్ చేసిన బస్సు నంబరుతో విజయవాడలోనూ మరొకటి తిరుగుతూ పట్టుబడినట్లు తేలింది.
- రెండు రోజులకు క్రితం బెంగళూరు–విజయవాడ ట్రావెల్స్ బస్సును జిల్లా రవాణాశాఖ అధికారులు తనిఖీ చేశారు. ఇందులో బండికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పన్ను చెల్లించిన రశీదు అడిగారు. డ్రైవర్ వెంటనే పన్ను కట్టినట్లు రశీదును చూపించారు. అయితే ఆ బిల్లు నకిలీది అని తేలింది. పన్ను కట్టిన పాత పత్రంలో తేదీ మార్చినట్లు చూపించారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో కోకొల్లలుగా జరుగుతున్నాయి.

- జిల్లాలో యథేచ్ఛగా ట్రావెల్స్ దందా
- తప్పుడు పత్రాలతో తిరుగుతున్న ప్రైవేట్ బస్సులు
- పన్ను ఎగ్గొట్టేందుకు నకిలీ రశీదులు
- రవాణాశాఖ అధికారులను బురిడీ కొట్టిస్తున్న బస్ ఆపరేటర్లు
- ఒకే నంబర్‌తో రాకపోకలు సాగిస్తున్న రెండు.. మూడు సర్వీసులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో ప్రైవేటు బస్సుల దొంగాట ముదిరింది. ట్రావెల్స్ నిర్వాహకులు పన్నులు ఎగొట్టేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. తప్పుడు పత్రాలతో రయ్..రయ్‌మంటూ బస్సును నడుపుకుంటున్నారు. లగుజీలను సైతం తరలించేస్తున్నారు. ఇష్టారాజ్యంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నారు. రవాణాశాఖ అధికారుల కంట్లో కారం కొడుతున్నారు. అప్పుడప్పుడు అధికారుల తనిఖీలో ఈ దందా వెలుగుచూస్తోంది.

పన్నుకు పంగనామాలు

జిల్లాలో ఒకప్పుడు 90కి పైగా ప్రైవేటు బస్సులున్నాయి. ప్రస్తుతం 40 బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. జిల్లాకు సంబంధించిన బస్సులు బెంగళూరు నుంచి తిరుపతికి 10 నుంచి 15 తిరుగుతున్నాయి. అలాగే కర్ణాటక నుంచి 70– 75 బస్సులు తిరుపతి, విజయవాడకు రాకపోకుల సాగిస్తున్నాయి. తమిళనాడు నుంచి 50– 60 సర్వీసులు తిరుపతికి చిత్తూరు మీదుగానే నడుస్తున్నాయి. వీటిలో పలు బస్సులు పన్నుకు పంగనామాలు పెడుతున్నాయి. పన్ను భారం నుంచి బయటపడేందుకు చాలా వరకు అరుణాచల్‌ప్రదేశ్, నాగలాండ్ రాష్ట్రాలకు క్యూక డుతున్నాయి. ఆరాష్ట్రాల్లో పన్ను తక్కువ కావడంతో అక్కడ రిజిస్ట్రేషన్ చేసేందుకు మొగ్గుచూపుతున్నాయి. ఇక్కడ ఒక్కో బస్సుకు కనిష్టంగా రూ.90వేలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే అక్కడ కేవలం రూ.20వేలు పన్ను చెల్లిస్తే నేషనల్ పర్మిట్‌తో బస్సు తిప్పుకునే అవకాశముంటుంది. దీంతో జిల్లాలో రిజిసే్ట్రషన్ చేసుకునే బస్సుల సంఖ్య భారీగా పడిపోయింది. ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్లతో తిరిగే బస్సులే జిల్లాలో అధికంగా కనిపిస్తున్నాయి.

ట్యాక్స్ కట్టకుండానే...

చాలా వరకు ప్రైవేటు బస్సులు పన్ను కట్టకుండానే తిరిగేస్తున్నాయి. బయట రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు ఇష్టానుసారంగా వచ్చి వెళ్లిపోతున్నాయి. నేషనల్ పర్మిట్, ఇతరత్ర పన్నులు లేకుండా జిల్లా మొత్తం తిరుగుతున్నాయి. పన్ను చెల్లింపు గడవు తీరినా.. మళ్లీ చెల్లించకుండా జాప్యం చేస్తున్నాయి. కొన్ని బస్సులు గడువు తీరిన పత్రాల్లో తేదీలు మార్చి పన్ను చెల్లింపునకు ఎగనామం పెడుతున్నాయి. నకిలీ రశీదులతోనే దేశవ్యాప్తంగా తిరిగేస్తున్నాయి. ఇలాంటి కేసులు ఇటీవల ఎక్కువయ్యాయి. అధికారులు చేపట్టే తనిఖీలో లోతుగా పరిశీలిస్తేనే ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇక కొంత మంది మోసగాళ్లు రాష్ట్ర సరిహద్దులో పాగా వేశారు. పన్ను చెల్లింపుదారులను అప్పన్నంగా దోచుకుంటున్నారు. పన్ను చెల్లించినట్లు తప్పుడు రశీదులిచ్చి మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి కారణాటతో ప్రతి మూడు నెలలకు ఒకసారి రూ. 60 లక్ష నుంచి రూ. కోటి వరకు రాష్ట్రానికి పన్ను రూపంలో వచ్చే ఆదాయం ఎగవేతకు గురవుతున్నట్లు అధికారులు గుర్తించారు.

నిబంధనల ఉల్లంఘన

చిత్తూరు మీదుగా బెంగళూరు, తమిళనాడు వెళ్లే బస్సులు నిబంధనలు పాటించడం లేదు. ఎక్కడ పడితే అక్కడ బస్సులను ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నాయి. ప్రధానంగా లగేజీలను తరలిస్తున్నాయి. ఈ ట్రావెల్స్ బస్సులు లగేజీలను తీసుకెళ్లడానికి అనుమతి లేదు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఎక్కడ పడితే అక్కడ ప్రయాణికులను ఎక్కించుకోవడానికి కూడా ట్రావెల్స్‌కు అనుమతి లేదు. రిజర్వేషన్ లేకుండా బండి ఆపిన చోట ప్రయాణికులను ఎక్కించుకుని పోతున్నాయి. వీటిని కట్టడి చేయడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.

ఒకే బస్సు పేరుతో..

అలాగే కొందరు బస్సు నిర్వాహకులు పన్ను విషయంలో కక్కుర్తి పడుతున్నారు. ఒకే బస్సు నంబరుతో మరొకటి కూడా నడుపుకుంటున్నారు. ఎక్కువగా ట్రావెల్స్ నిర్వాహకులే ఇలాంటి దందాకు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇలా ఏళ్ల తరబడి ఒకటి రెండు బస్సులకు పన్ను చెల్లింయెకుంటూ మిగిలిన వాటిని అదే నంబర్‌తోనే నడుపుతున్నట్లు అధికారుల విచారణలో బయటపడింది. కొంత మంది పన్ను కట్టకుండా తిరుగుతూ...కేసులు పెట్టించుకుంటున్నారు. ఆ తర్వాత న్యాయస్థానాన్ని ఆశ్రయించి పన్ను చెల్లింపును తగ్గించుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు.



ప్రైవేట్ బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు



పర్మిట్ లేకుండానే 'కేఎస్ఆర్టీసీ'



పర్మిట్ లేకుండా పలమనేరు మీదుగా చిత్తూరుకు వెళుతున్న కేఎస్ఆర్టీసీబస్సు(ఫైల్)

పలమనేరు : కర్ణాటక ఆర్టీసీ బస్సులు ఎలాంటి పర్మిట్ లేకుండానే జిల్లాలో తిరుగుతున్నాయి. ప్రధానంగా తిరుపతి, పలమనేరు, చిత్తూరు, పుత్తూరుకు అధిక సంఖ్యలో బస్సులు నడుపుతున్నాయి. బెంగళూరు, కోలారు, ముళబాగిళు, శ్రీనివాసపుర డిపోలనుంచి రిజర్వులో ఉన్న బస్సులను సైతం అంతర్రాష్ట్ర పర్మిట్లు లేనప్పటికీ తిరుపతి వెళ్లువారు అధికంగా ఉంటే స్పెషల్ ట్రిప్పులు వేస్తున్నాయి. ఫలితంగా మన ఖజానాకు గండిపడుతోంది.

జిల్లా నుంచి 125 సర్వీసులు

ఉమ్మడి జిల్లాలోని తిరుపతి, మంగళం, తిరుమల, చిత్తూరు తదితర డిపోలనుంచి బెంగళూరుకు 125 దాకా అంతర్రాష్ట్ర సర్వీసులు నడుస్తున్నాయి. వీటికి పక్కాగా పర్మిట్ తీసుకున్నారు. అయితే కర్ణాటక నుంచి దాదాపు 70 బస్సులు జిల్లాకు వస్తున్నాయి. వీటిలో చాలా సర్వీసులకు పర్మిట్‌లు లేవు. జిల్లా రవాణాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో కర్ణాటక ఆర్టీసీ బస్సులు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి.

అడిగే దిక్కులేదు...

పలమనేరు, చిత్తూరులకు పొరుగునే ఉన్న ముళబాగిలు, కోలార, చింతామణి, శ్రీనివాసపురం నుంచి రాత్రి సర్వీసులు పదికి పైగా బస్సులు పర్మిట్లు లేకుండానే బస్సులు తిరుగుతున్నాయి. ఈ బస్సులను గమనించి పలమనేరు, చిత్తూరు డిపోలకు చెందిన ఆర్టీసీ అధికారులు పలు మార్లు అడ్డుకున్నారు. అయితే వాటిపై చర్యలు తీసుకోవాల్సింది రవాణాశాఖ కాబట్టి ఆర్టీసీ వారు వీటిని నిలువరించలేక వదిలేశారు. దీంతో మరింత రెచ్చిపోయిన కర్ణాటక ఆర్టీసీ అధికారులు పర్మిట్ లేని బస్సులను రెట్టింపుచేసి జిల్లాలోకి పంపుతున్నారు.

ప్రత్యేక బృందాలతో తనిఖీ



"ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేక బృందాలను సైతం ఏర్పాటు చేశాం. ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా బస్సులను తనిఖీలు చేసేలా ఆదేశాలిచ్చాం. ఈ క్రమంలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. ట్యాక్స్ ఎగవేతకు చాలా మంది ప్రయత్నిస్తున్నారు. వాటిని పసిగట్టి జరిమానా విధిస్తున్నాం. అతిక్రమిస్తే కేసులు పెడుతున్నాం.

– నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

అయ్యో.. బాబూ!



చిత్తూరు డీఈఓ కార్యాలయం ఎదుట నిరసనకు దిగిన యూటీఎఫ్ జిల్లా నేతలు (ఫైల్)

- ఉమ్మడి చిత్తూరులో అయ్యోర్లకు జీతాల సమస్య
- పొజిషన్ ఐడీ లేక అయోమయం
- రెండు నెలలుగా అవస్థలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 4,737 ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, నగర పాలక, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో 18,540 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో నిర్వహించిన బదిలీల కసరత్తులో ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 7 వేల మంది టీచర్లను బదిలీ చేశారు. అదేవిధంగా హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు 800 వరకు ఉన్నారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన పలు కేడర్ల టీచర్లు రెండు నెలలుగా జీతాలు లేక అవస్థలు ఎదుర్కుంటున్నారు. జీతాల కోసం నిత్యం డీఈవో కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. తమ చేతుల్లో ఏమీ లేదని విద్యాశాఖ అధికారులు చేతులెత్తేస్తున్నారు.

పొజిషన్ ఐడీ పేరుతో కక్ష

పొజిషన్ ఐడీ పేరుతో టీచర్ల పట్ల కూటమి ప్రభుత్వం జీతాలు మంజూరు చేయకుండా కక్ష సాధింపులకు దిగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా తెరపైకి పొజిషన్ ఐడీ పేరును తీసుకొచ్చింది. ఏదో ఒక విధంగా టీచర్లను ఇబ్బందులు పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు.

కేబినెట్ ఆమోదం అవసరమట

పొజిషన్ ఐడీలకు కేబినెట్ ఆమోదం అవసరమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఉపాధ్యాయ సంఘ నేతలు మండిపడుతున్నారు. కేబినెట్ ఆమోదం పేరుతో జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు సృష్టించడం సబబు కాదని హెచ్చరిస్తున్నారు. అసలు పొజిషన్ ఐడీల ఫైల్ కేబినెట్‌లో ఆమోదం పొందిందో...లేదో అనే విషయం తెలియడం లేదని, ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 వేల మంది టీచర్లు జీతాలు పొందలేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని వాపోతున్నారు. పెండింగ్ జీతాల బిల్లులు పెట్టుకునేందుకు ఈ నెల 27 వరకు రాష్ట్ర ట్రెజరీ అధికారులు అవకాశం కల్పించారని, అయితే పొజిషన్ ఐడీలు లేకపోవడంతో టీచర్లు బిల్లులు నమోదు చేయలేక మిన్నకుంటున్నట్టు తెలిపారు.

అయ్యోర్ల నిరసన


జీతాల కోసం ఉపాధ్యాయులు శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసనకు దిగారు. వేతనాల సమస్యను వెంటనే పరిష్కరించాలని రోడ్డెక్కారు. బదిలీలు చేపట్టి రెండు నెలలు కావొస్తున్నా పొజిషన్ ఐడీలు ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. తాజాగా కేబినెట్ భేటీ నిర్వహించినప్పటికీ అందులో పొజిషన్ ఐడీల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లకపోవడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు.



నగరిలో యూటీఎఫ్ నేతల నిరసన (ఫైల్)

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బదిలీల సమాచారం

యాజమాన్యం	ఖాళీలు
ప్రభుత్వ	125
ఎంపీపీ/ జెడ్పీ	1,583
మున్సిపల్ కార్పొరేషన్	135
మున్సిపల్	75
5/8 ఏళ్లు ఒకే చోట పనిచేసిన టీచర్లు	3,000
మిగిలు పోస్టులు	500
రీ అపోర్షన్/షిఫ్టెడ్	1,582
మొత్తం	7,000



జీతాలపై వాట్సాప్ గ్రూపుల్లో టీచర్ల మెసేజ్‌లు

పొజిషన్ ఐడీలు మంజూరు చేయాలి



"పొజిషన్ ఐడీలు ఇచ్చేందుకు నెలల సమయం అవుతుందా..?. టీచర్ల పట్ల ఇంత చులకన భావన ఎందుకో. రెండు నెలల జీతాలు లేకపోవడంతో టీచర్లు అవస్థలు పడుతున్నారు. కేడర్ స్ట్రెంత్ నివేదికలు సిద్ధం చేసి పొజిషన్ ఐడీలు ఇవ్వడం పట్ల అలసత్వం వహించడం దారుణం. ఉద్దేశ పూర్వకంగా చేస్తున్నారని అనిపిస్తోంది.

– జీవీ రమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

అన్యాయం



పొజిషన్ ఐడీలు ఇవ్వకుండా ఆలస్యం చేయడం అన్యాయం. నెలల తరబడి ఐడీల పేరుతో జీతాలు ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదు. ఈ సమస్య రాష్ట్ర మొత్తం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది టీచర్లు పొజిషన్ ఐడీ సమస్యతో రెండు నెలల జీతాలు పొందలేకపోయారు. పలు మార్లు ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా అలసత్వం వహించడం సబబు కాదు.

– బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

రూ.1.87 కోట్ల విద్యుత్ బిల్లుల వసూలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో ఆదివారం విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాలను అందుబాటులో ఉంచారు. మొత్తం 3,116 మంది బిల్లు కట్టగా తద్వారా రూ.1.87 కోట్లు వచ్చినట్లు చిత్తూరు, తిరుపతి జిల్లాల ట్రాన్స్‌కో ఎస్ఈలు ఇస్మాయిల్‌అహ్మద్, సురేంద్ర నాయుడు పేర్కొన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానం, గోసంరక్షణ ట్రస్టుకు విరాళం


నగదు విరాళం చేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని నిత్యాన్నదానం, గోసంరక్షణ ట్రస్టుకు దాతలు నగదు విరాళంగా అందజేశారు. తిరుపతికి చెందిన దాతలు కృష్ణమోహన్, పార్థసారథినాయుడు నిత్యాన్నదానానికి రూ.2 లక్షల నగదు విరాళంగా అందించారు. అలాగే గోసంరక్షణ ట్రస్టుకు బెంగళూరుకు చెందిన పుష్పలత, శివప్రసాద్ రూ.లక్ష విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చూశారు.

రోడ్డు ప్రమాదంలో గీత కార్మికుడి మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు


విజేంద్ర (ఫైల్)

నగరి : పురపాలక పరిధిలోని ఏఎన్ కండ్రిగ కాలనీ మలుపు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పి.విజేంద్ర (62) అనే గీతకార్మికుడు మృతి చెందాడు. వివరాలు.. ఏఎన్ కండ్రిగ నుంచి విజేంద్ర సైకిల్‌పై బుగ్గ దేవాలయానికి వెళుతుండగా ఎదురుగా ఇటుకల లోడ్డుతో వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. దీంతో విజేంద్ర అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సీఐ విక్రమ్ కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విజేంద్ర వైఎస్సార్‌సీపీ కార్యకర్త కావడంతో పార్టీ శ్రేణులు హుటాహుటిన ఘటనా స్థలానికి, ఆస్పత్రికి చేరుకున్నాయి.

దళితులపై దాడులకు నిరసనగా 'యాత్ర'


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దళిత నేతలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): దళితులపై దాడులకు నిరసనగా ఆగస్టు 3వ తేదీన కుప్పం నుంచి భారత రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపడుతున్నట్లు రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అశోక్‌బాబు తెలిపారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దళితులపై దాడులు జరుగుతున్నాయన్నారు. రిజర్వేషన్లు కనుమరుగుతన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవస్థలన్నీ కూడా ప్రైవేట్ పరమవుతున్నాయని మండిపడ్డారు. ఈనేపథ్యంలో ఎస్సీ జనాభాకి అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు.'రాజ్యాంగ పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. నేతలు దాసరి చెన్నకేశవ, మహాసముద్రం కృష్ణయ్య, పార్థసారథి వెంకటగిరి దాము, ఉదయ్ కుమార్, సీజీ దాసు పాల్గొన్నారు.

షార్ నుంచి ఈనెల 30న జీఎస్ఎల్వీ ఎఫ్16 నుంచి నిసార్ ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సమాయత్తం అవుతున్నారు. ఇందులో బాగంగా నేడు ఎంఆర్ఆర్ సమావేశంలో చర్చించిన అనంతరం ప్రయోగం కౌంట్ డౌన్ సమయాన్ని నిర్దేశించనున్నారు. ఈ ప్రయోగాన్ని నాసా–ఇస్రో సంయుక్తంగా నిసార్ రూపొందించారు. ఈ ప్రయోగంతో భూమికి అత్యంత దగ్గరగా పరిశీలించే వెసులుబాటు కలగనుంది.


షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై ప్రయోగానికి సిద్ధం చేసిన జీఎస్ఎల్వీ ఎఫ్ 16 ఉపగ్రహ వాహకనౌక

మొదటిసారిగా నాసాతో సంయుక్తంగా..

ఇస్రో–నాసా మొట్ట మొదటిసారి ఉమ్మడిగా నాసా–ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్ ఉపగ్రహాన్ని (నిసార్) రూపొందించారు. ఇది ప్రత్యేకమైన భూమి పరిశీలన ఉపగ్రహం కావడం విశేషం. డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపార్చర్ రాడార్ (నాసాది ఎల్–బ్యాండ్, ఇస్రోది ఎస్–బ్యాండ్) భూమిని అత్యంత దగ్గరగా పరిశీలించే ఉపగ్రహం కావడం విశేషం. ఈ ప్రయోగానికి సంబంధించి నేడు ఎంఆర్ఆర్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశం అనంతరం కౌంట్ డౌన్ సమయాన్ని, ప్రయోగ సమయాన్ని అధికారికంగా నిర్ణయిస్తారు. ముందుగా ప్రకటించిన సమయం కంటే కొద్దిగా మార్పులు చేర్పులు ఉండే అవకాశం ఉంటుంది.

నింగికి సిద్ధంగా నిసార్

- ఈనెల 30న జీఎస్ఎల్వీ ఎఫ్16 రాకెట్ నుంచి ప్రయోగం
- 29న కౌంట్‌డౌన్ ప్రక్రియకు సన్నాహాలు
- నేడు ఎంఆర్ఆర్ సమావేశం

సూళ్లూరుపేట : తిరుపతి జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఈనెల 30న సాయంత్రం 5.40 గంటలకు జీఎస్ఎల్వీ ఎఫ్16 రాకెట్ ద్వారా 2,392 కిలోల బరువు కలిగిన నిసార్ ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రయోగ సమయానికి 25 గంటల ముందు కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉంది. ఈ ఉపగ్రహాన్ని 98.40 డిగ్రీల వంపుతో భూమికి 743 కిలోమీటర్ల ఎత్తులోని సూర్య–సమకాలిక కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు.


విద్యుద్దీపాల వెలుగులో జీఎస్ఎల్వీ ఎఫ్16 రాకెట్


రాకెట్‌ను ప్రయోగవేదిక మీద అనుసంధానం చేసేందుకు తరలిస్తున్న దృశ్యం

మూడు దశల్లో జీఎస్ఎల్వీ ఎఫ్16 ప్రయోగం

పీఎస్ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే జీఎస్ఎల్వీ రాకెట్‌ను మూడు దశల్లోనే ప్రయోగిస్తారు. 51.7 మీటర్లు పొడవు ఉన్న జీఎస్ఎల్వీ ఎఫ్16 రాకెట్ ప్రయోగ సమయంలో 420 టన్నుల బరువుతో భూమి నుంచి నింగికి బయలు దేరుతుంది. ఈ ప్రయోగంలో 2,392 కిలోలు బరువు గల నిసార్ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. రెండో ప్రయోగ వేదికకు సంబంధించిన వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో రాకెట్ అనుసంధానం పూర్తి చేసి గురువారం తెల్లవారుజామున 4 గంటలకు రాకెట్‌ను వ్యాబ్ నుంచి ప్రయోగ వేదిక మీదకు నెమ్మదిగా తరలించే ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా జీఎస్ఎల్వీ ఎఫ్16 రాకెట్‌ను దశల వారీగా అనుసంధానించే దృశ్య మాలిక ఇది. జీఎస్ఎల్వీ మార్క్2 సిరీస్‌లో 18వ ప్రయోగం కావడం విశేషం. షార్ కేంద్రం నుంచి 102వ ప్రయోగం కావడం విశేషం.


వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్ మొదటి దశను అమర్చుతున్న దృశ్యం

మొదటి దశ ఇలా

కోర్ అలోన్ దశలో 138.1 టన్నుల ఘన ఇంధనం ఉంటుంది. రాకెట్‌కు చుట్టూ నాలుగు స్ట్రాపాన్ బూస్టర్లుకు కలిపి 170.7 టన్నుల ద్రవ ఇంధనంతో మొదటి దశను పూర్తి చేస్తారు.


రెండోదశ రాకెట్ అనుసంధానంలో భాగంగా ద్రవ ఇంధనం దశను అమర్చుతున్న దృశ్యం

రెండో దశ ప్రక్రియ

రెండో దశలో 42.1 ద్రవ ఇంధనాన్ని నింపుతారు. ఈ దశలో ఇంధనాన్ని కౌంట్ డౌన్ సమయంలోనే నింపే ప్రక్రియను చేపడతారు.


రాకెట్‌కు మూడో దశలో క్రయోజనిక్ దశను అమర్చుతున్న దృశ్యం

మూడో దశ ఇలా

మూడో దశను మహేంద్రగిరిలోని ఇస్రో ప్రపోల్షన్ సెంటర్‌లో రూపొందించి, అందులో 14.5 టన్నుల క్రయోజనిక్ ఇంధనాన్ని నింపి మూడోదశను పూర్తి చేస్తారు. ఈ దశకు పైభాగంలోనే ఉపగ్రహాన్ని అమర్చుతారు.

పోలీసు శాఖపై ఆ వ్యాఖ్యలు సరికావు


మాట్లాడుతున్న పోలీసు యూనియన్ నాయకులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎస్పీ, పోలీసు శాఖపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చేసిన వ్యాఖ్యలు సరికావని జిల్లా పోలీసు సంక్షేమ సంఘ నాయకులు తెలిపారు. అభ్యంతరకరమైన, వ్యక్తిగత దూషణ లాంటికి కాకుండా హుందాగా వ్యవహరించాలన్నారు. చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో ఆదివారం ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కోశాధికారి పరంధామనాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి ఖాదర్‌బాషా, సభ్యుడు శరవణ పాల్గొని మీడియాతో మాట్లాడారు. పోలీసు శాఖపై వైఎస్సార్‌సీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు అభ్యంతరకరమన్నారు.

ఈ ప్రశ్నలకు మౌనం!

ఎస్పీపై వైఎస్సార్‌సీపీ నేతల వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్న పోలీసు యూనియన్ నాయకులను 'సాక్షి' అడిగిన ప్రశ్నలకు నీళ్లు నములుతూ మౌనం వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్ఐ నుంచి ఐపీఎస్ అధికారుల వరకు 200 మందికి పోస్టింగులు ఇవ్వకుంటే యూనియన్ ఎందుకు మౌనంగా ఉందని అడిగితే.. అది రాష్ట్ర యూనియన్ చూడాలన్నారు. పుంగనూరులో ఓ టీడీపీ కార్యకర్త హత్యకు గురైతే ఏకంగా కూటమి పార్టీకి చెందిన ఎమ్మెల్యే మాట్లాడుతూ 'ఎస్పీ మణికంఠ వల్లే ఈ హత్య జరిగింది...' అంటూ హత్యారోపణ చేస్తే ఎందుకు యూనియన్ నోరు మెదపలేదని అడిగితే నీళ్లు నమిలారు. అందుకే 200 మందికి పైగా సిబ్బందిని బదిలీ చేశారని దాటవేసే సమాధానం చెప్పారు.

శ్రీవారిసేవలో సీఎస్

తిరుమల : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదివారం ఉదయం తిరుమల వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలు, డైరీ, క్యాలెండర్‌ను ఈవో జె.శ్యామలరావు అందజేశారు.

జంతువులకున్న విలువ
మనుషులకు లేదా..?


గ్రామస్తుల ఆందోళన

సోమల(సదుం): జంతువులకు వున్న విలువ మనుషులకు లేదా అని సోమల మండలం కొత్తూరు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తూరులో శనివారం రాత్రి ఏనుగుల దాడిలో రామకృష్ణమరాజు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆయన మృతదేహంతో ఆదివారం ఉదయం వరకు రోడ్డుపై బైఠాయించి గ్రామస్తులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ శనివారం సాయంత్రం 5 గంటలకు ఏనుగుల దాడిలో మనిషి మృతిచెందాడని, రాత్రి 10 గంటల వరకు అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడవిలో జంతువులు చనిపోతే హుటాహుటిన వచ్చే అధికారులు మనుషులు చనిపోతే పట్టించుకోరా అని ఆవేదన వ్యక్తం చేశారు. కుంకీ ఏనుగులు ఎక్కడని నిలదీశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తమ గ్రామానికి రావాలని, అంతవరకు అంత్యక్రియలు నిర్వహించేది లేదని భీష్మించారు. సంవత్సరాల తరబడి ఏనుగులు పంటలపై దాడులు చేసి నష్టం చేస్తున్నాయని వాపోయారు. సుమారు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పంటలు నష్ట పోతున్నా రూ.10 వేలు పరిహారం చెల్లిస్తున్నారని తెలిపారు. తాము వ్యవసాయం వదులుకోవాల్సిందేనా అంటూ వాపోయారు.

పరిశీలించిన డీఎఫ్‌వో:

ఏనుగుల దాడిలో వ్యక్తి మృతిచెందిన ప్రాంతాన్ని ఆదివారం ఉందయం డీఎఫ్‌వో భరణి పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మూడు నెలల పాటు రైతులెవరూ సాయంత్రం 4 గంటల అనంతరం అటవీ సరిహద్దుల్లో ఉన్న పొలాల వద్దకు వెళ్లరాదని సూచించారు. తేనె టీగలను పెంచుకుంటే ఏనుగుల దాడులను అరికట్టవచ్చని, రైతులకు ఆదాయం చేకూరుతుందని చెప్పారు. ఆమె హామీతో రామకృష్ణంరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పుంగనూరుకు తరలించారు.

జీడీనెల్లూరులో టీడీపీ

- తెలుగు తమ్ముళ్లలో భగ్గుమన్న విభేదాలు
- రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర ఆరోపణలు


వీడియోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్


ఎమ్మెల్యే థామస్ పీఏపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్ : గంగాధరనెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గంలో దాదాపు 30 ఏళ్ల తర్వాత టీడీపీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఆ పార్టీలో ఇటీవల వర్గవిభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఎమ్మెల్యే అనుకూల, వ్యతిరేకం పేరుతో రెండు వర్గాలు తయారయ్యాయి. పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ కార్యకర్తలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే థామస్ పీఏ చంద్రశేఖర్ అవినీతిపరుడు అంటూ శుక్రవారం ఓ వర్గంవారు కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో విభేదాలు బహిర్గతమయ్యాయి. నియోజకవర్గంలోని టీడీపీ సీనియర్ నేత గుండయ్య, ఎమ్మెల్యే థామస్ సొంత తమ్ముడు నిధి, హరిబాబు నాయుడు మరి కొందరు నాయకులు కలిసిఎమ్మెల్యే లెటర్ ప్యాడ్లను పీఏ చంద్రశేఖర్ అమ్ముకుంటున్నాడని ఆరోపించారు. ఎమ్మెల్యేను అవినీతి కూపంలోకి దింపుతున్నాడని, మన్నారుగుడి మాఫియాలా ఎమ్మెల్యే చుట్టూ అవినీతిపరులే ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తమ్ముళ్ల కుమ్ములాట బయటపడింది.

వ్యతిరేకులంతా చీడపురుగులన్న ఎమ్మెల్యే

కలెక్టర్‌కు పలువురు టీడీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుపై ఎమ్మెల్యే థామస్ ఓ వీడియో విడుదల చేశారు. తన వద్ద 8 నెలలుగా పనిచేస్తున్న పీఏ చంద్రశేఖర్ చాలా మంచి వాడని, తన వ్యతిరేకులందరూ చీడపురుగులని ఆరోపించారు. ప్రధానంగా పీఏపై ఫిర్యాదు చేసిన వారు స్వార్థపరులను మండిపడ్డారు. అవినీతిపరులందరూ జట్టు కట్టి తనను రాజకీయంగా అణగదొక్కాలని యత్నిస్తున్నట్లు విమర్శించారు. వారు చెప్పిన పనులు చేయనందుకే తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. పీఏ చంద్రశేఖర్ గతంలో ఓ వైసీపీ ఎమ్మెల్యే వద్ద పనిచేశాడని, ప్రస్తుతం మంత్రుల వద్ద ఓఎస్డీలుగా గత ప్రభుత్వంలో పని చేసిన వారు లేరా అని ప్రశ్నించారు.

గుండయ్య అవినీతిపరుడు


ఎమ్మెల్యే పీఏ పై ఆరోపణలు చేస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నేత గుండయ్య అవినీతిపరుడని ఎమ్మెల్యే పేరు చెప్పుకుని రూ.లక్షలు వసూలు చేశాడని ఆ పార్టీకి చెందిన కొందరు నాయకుల వీడియోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. సాధారణ పేద కుటుంబానికి చెందిన గుండయ్య తిరుపతిలో మూడంతస్తుల భవనం, వేలూరులో ఒక భవనం, ఎస్ఆర్ పురంలో మూడంతస్తుల భవనం ఎలా నిర్మించాడని వీడియోల్లో వెల్లడిస్తున్నారు. పెనుమూరుకు చెందిన ఓ నేత మాట్లాడుతూ గుండయ్య తన వద్ద రూ.లక్షలు తీసుకున్నాడని ఆరోపిస్తున్నారు.

క్రమశిక్షణ తప్పితే చర్యలు

గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో రేగిన రాజకీయ రగడపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని టీడీపీ నేతలు ఎలాంటి ప్రెస్‌మీట్‌లు నిర్వహించకూడదని, వీడియోలను సోషల్ మీడియాలో పెట్టకూడదని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిణామాలను అధిష్టానం దృష్టికి తీసుకెళతామని, త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎవరైనా ఫిర్యాదులు చేయాలనుకుంటే ఆ సమావేశంలో చేసుకోవాలని సూచించారు. పార్టీ క్రమశిక్షణను తప్పితే ఎంతటి వారిపై అయినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

టమాటకు రెక్కలు!

- పలమనేరులో బాక్సు ధర రూ.650


పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాట

పలమనేరు : టమాట ధరలకు రెక్కలు వచ్చాయి. ఆదివారం పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో బాక్స్(14కేజీలు) టమాట ధర ఒక్కసారిగా రూ.500 నుంచి రూ.650కి చేరింది. మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, తెలంగాణలో పంట తగ్గుముఖం పట్టడం, తమిళనాడులో సీజన్ ముగియడం, కర్ణాటలో తెగుళ్ల కారణంగా దెబ్బతినడంతో బయటి వ్యాపారులు జిల్లాలోని మార్కెట్లకు భారీగా వస్తున్నారు. దీంతో టమాట ధర పెరుగుతోందని స్థానిక వ్యాపారులు వెల్లడిస్తున్నారు. ఈక్రమంలో ప్రస్తుతం పంట కోతల్లో ఉన్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన లోడ్లు

పలమనేరు, పుంగనూరు, వి.కోట, సోమల, సదుంలోని టమాట మారెక్ట్‌లకు సాధారణంగా రోజూ వంద లోడ్ల సరుకు రావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 60 లోడ్ల టమాట మాత్రమే వస్తోంది. ఇదే సమయంలో డిమాండ్ అధికంగా ఉండడంతో టమాట రేటు ఒక్కసారిగా పుంజుకుంది.

మొదలైన ఎగుమతులు

ప్రస్తుతం జిల్లా నుంచి బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, యూఏఈ, సౌత్ ఆఫ్రికా దేశాలకు టమాటను ఎగుమతి చేస్తున్నారు. ఈ క్రమంలో నాణ్యమైన టమాటకు డిమాండ్ అమాంతం పెరిగింది. మొన్నటి దాకా బాక్సు రూ.200 పలికిన టమాట, ఇప్పుడు బాక్సు రూ.650కి చేరుకుంది. ఇక ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ కాయలైతే ధర రూ.700 పైగా చేరింది. మరో నెలపాటు టమాట ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు వెల్లడిస్తున్నారు.

పంటలపై ఏనుగుల దాడి


మామిడితోటలో సీసీ కెమెరాను ధ్వంసం చేసిన ఏనుగులు

పలమనేరు: కుంకీ ఏనుగులు వచ్చి ఏమి చేస్తాయోగాని కౌండిన్య అడవిలోని మదపుటేనుగులు రైతుల పొలాల్లోకి వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఆమేరకు ఇప్పుడు అటవీశాఖ కుంకీ ఎలిఫెంట్ క్యాంపు ఏర్పాటు చేసిన గ్రామమైన ముసలిమొడుగులోనే ఏనుగులు పలువురు రైతుల మామిడితోటల్లోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆపై తోటలోని కొమ్మలను విరిచి కాయలను ఆరగించి నష్టాన్ని కలిగించాయి. గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌నాయుడికి వీటి కారణంగా నష్టం కలిగింది. దీంతో స్థానిక ఫారెస్ట్ సిబ్బంది పంట నష్టాన్ని అంచనా చేసి నష్టపరిహారంకోసం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు.

బాల సదనంలో ఉద్యోగాలకు దరఖాస్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని బాలసదనంలో అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ప్రతిపాదికన ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బాలసదనం సూపరింటెండెంట్ తెలిపారు. కుక్–2 పోస్టులు, హెల్పర్, హెల్పర్ కం నైట్‌వాచ్ మెన్–2, హౌస్ కీపర్–1 ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌కు మ్యూజిక్ టీచర్–1, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు సంబంధిత వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 9000106774 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అమానుషంగా ప్రవర్తించిన పీడీ సస్పెన్షన్

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా కోట బాలికల ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న ఎస్కేమా బాషాను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న సమారు 70మంది విద్యార్థినులు యూనిఫామ్‌తో రాలేదని పీడీగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఒక్కొక్కరి వద్ద 150 గుంజీలు తీయించడంతో విద్యార్థినులు ఆస్పత్రి పాలయ్యారు. దీంతో ఆగ్రహించిన డీఈఓ ఘటనపై ప్రధానోపాధ్యాయురాలు సమాచారం అందించడంలో విఫలమయ్యారంటూ ఆమెకు సైతం షోకాజు నోటీలు జారీచేశారు.

అధికారుల విచారణ

కోట : కోటలోని ఎస్సీ బాలికల వసతిగృహాన్ని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, నాయకులు సందర్శించారు. బాలికలతో మాట్లాడి వారిపై జరిగిన దాడిని ఖండించారు. గూడూరు డీఎస్పీ గీతాకుమారి, వాకాడు సీఐ హుస్సేన్‌బాష జరిగిన సంఘటనపై వివరాలు సేకరించారు. బాలికలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్‌పై కేసు నమోదు చేస్తామన్నారు. పలువురు దళిత, ప్రజా సంఘాల నాయకులు వసతిగృహంలో విచారణ జరిపారు.